APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

సంపుటి :9 సంచిక : 215 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 10-01-2023 మంగళవారం పేజీలు :4 వెల : రూ.3/-







# ఆర్థికాభివృద్ధికి విద్య బలమైన సాధనం : గవర్నర్ హరిచందన్



**విజయవాడ :** ఏ సమాజమైనా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్య అత్యంత బలమైన సాధనమని, విద్య, పేదరికం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వెనిగండ్ల గ్రామం కౌండిన్యపురంలో సోమవారం నిర్వహించిన ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కౌండిన్య ఐఎఎస్ అకాడమీని గవర్నర్ ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని అర్హులైన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ హరిచందన్ మాట్లాడుతూ ఒక వ్యక్తి మంచి విద్యాధికునిగా మారినప్పుడు గణనీయమైన ఆదాయార్జనతో పేదరికం నుండి బయటపడే అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు.హౌకౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గత కొన్ని సంవత్సరాలలో సుమారు 4,500 మంది పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.96 లక్షల ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమన్నారు. సమాజంలో అర్హులైన బలహీన వర్గాల విద్యార్థులకు శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన కౌండిన్య ఐఎఎస్ అకాడమీ ఔత్సాహిక విద్యార్థులకు మేలు చేకూర్చుతుందన్నారు.

జాతీయ విద్యా విధానం-2020 విద్యారంగంలో పెద్ద సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. రాబోయే దశాబ్దాల్లో భారతదేశాన్ని విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చగలదని గవర్నర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, ట్రస్టు వ్యవస్థాపకులు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఇ.వి. నారాయణ, వాణిజ్య పన్నుల శాఖ మాజీ అదనపు కమిషనర్ వై. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు
















## సీఎం జగన్ చేతుల మీదుగా పాడి రైతులకు బోనస్ పంపిణీ

**అమరావతి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కర్నూలు మిల్క్ యూనియన్ (విజయడైరీ) పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. రూ.7.20 కోట్ల బోనస్ చెక్‌ను కర్నూలు మిల్క్ యూనియన్ ఛైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంకు అందజేశారు.

పాడిరైతుల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల తమ సహకార సమితి రెండేళ్లలో రూ.27 కోట్లు లాభాలు గడించిందని ఛైర్మన్ తెలిపారు. ఈ



సందర్భంగా కర్నూలు మిల్క్ యూనియన్ సమగ్ర పనితీరును వివరించారు. రానున్న రోజుల్లో డైరీని మరింత అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళతామని ఛైర్మన్, ఎండీ, డైరెక్టర్‌లు సీఎం జగన్‌కు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కర్నూలు మిల్క్ యూనియన్ (విజయడైరీ) ఛైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీ పరమేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రాజేష్, సొసైటీ డెరెక్టర్లు జి.విజయసింహారెడ్డి, యు.రమణ, మహిళా పాడి రైతు ఎన్. సరళమ్మ పాల్గొన్నారు.

## సంక్రాంతి రద్దీ.. బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తే కేసులు



**అమరావతి :** సంక్రాంతి రద్దీ వేళ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల (దోపీడీపై అధికారులు దృష్టి పెట్టారు. జిల్లాల డీటీసీలతో రవాణా శాఖ కమిషనర్ ఆంజనేయులు సమావేశమయ్యారు. సంక్రాంతి రద్దీ వేళ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు తనిఖీ చేయాలని ఆదేశించారు. అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ బస్సుల్లో 10 రోజులపాటు తనిఖీలు నిర్వహించనున్నట్లు రవాణాశాఖ సంయుక్త కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఫిట్‌నెట్, ఇతర ధ్రువపత్రాలు లేని బస్సులు సీజ్ చేస్తామని తెలిపారు. గమ్యస్థానం చేరాకే బస్సులను సీజ్ చేయాలని నిర్ణయించారు.

ఆన్‌లైన్ బుకింగ్‌లో వసూలు చేసే ఛార్జీలు చూసి కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రయాణికులు కూడా రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. రవాణాశాఖ వెబ్‌సైట్‌లోని ఫోన్ నెంబర్లకు కూడా ఫిర్యాదు చేయచ్చన్నారు. “గతేడాది 975 కేసులు, రూ.62 లక్షల జరిమానా విధించాం. తీవ్రతను బట్టి కేసులు నమోదు చేసి ప్రాసిక్యూషన్ చేస్తాం. ఆర్టీసీ బస్టాండ్ల వద్దకు ప్రైవేట్ బస్సులు రాకుండా చర్యలు తీసుకుంటాం. సంబంధంలేని లగేజీ తరలించే ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేస్తాం. కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను స్టేజ్ క్యారియర్లుగా తిప్పడం నేరం” అని వెంకటేశ్వరరావు తెలిపారు.

## నేడు శ్రీవారి వర్చువల్ సేవా టికెట్ల విడుదల



**తిరుమల :** మంగళవవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవా టికెట్ల దర్శన కోటాను విడుదల చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. ఈ నెల 12 నుంచి ఆలయంలో జరిగే వర్చువల్ ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవల కోసం టికెట్లు విడుదల చేసినట్లు తితిదే పేర్కొంది. బాలాలయం దృష్ట్యా ఫిబ్రవరి 22-28 మధ్య టికెట్లు విడుదల చేయడం లేదని తితిదే వెల్లడించింది.

## ఆస్తుల పంపిణీపై ఏపీ ప్రభుత్వం పిటిషన్.. సుప్రీంలో విచారణ

**ఢిల్లీ :** రాష్ట్ర విభజన తర్వాత ఆస్తుల పంపిణీపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు తెలంగాణ, కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు హాజరుకాలేదు. ఇరువురికి నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఆరువారాలు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన సరిగా జరగకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం పేర్కొంది. ఆస్తుల విభజన న్యాయబద్ధంగా జరిపేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని విన్నవించింది.

## సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్ :** సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. ఇప్పటికే వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్న ఎస్‌సీఆర్.. తాజాగా విశాఖ-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపడాలని నిర్ణయించింది. జనవరి 11 నుంచి 17 వరకు ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయి. జనవరి 11న రాత్రి 7.50 గంటలకు విశాఖలో బయలు దేరిన ప్రత్యేక రైలు(08505) మరుసటి రోజు ఉదయం 7.10కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. జనవరి 11, 13, 16 తేదీల్లో ఈ రైలు అందుబాటులో ఉంటుంది. మరోవైపు జనవరి 12, 14, 17 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి రాత్రి 7.40కి బయలుదేరిన ప్రత్యేక రైలు (08506) తర్వాతి రోజు ఉదయం 8.20కి విశాఖ చేరుకుంటుందని రైల్వే అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు రిజర్వేషన్లు ప్రారంభమవు తాయని తెలిపారు.

## మిగతా దేశాలతో పోలిస్తే.. కొవిడ్ కట్టడిలో భారత్ భేష్

### - సీరమ్ సంస్థ సీఈఓ అదర్ పూనావాలా



**ఢిల్లీ :** మిగతా దేశాలతో పోలిస్తే కొవిడ్ కట్టడిలో మనం మెరుగ్గా ఉన్నామనిహౌసీరమ్ ఇనిస్టిట్యూట్ సీఈఓ అదర్ పూనావాలా అన్నారు. ఈ మహమ్మారి కట్టడికి భారత్ తీసుకున్న చర్యలు, వైద్య సిబ్బంది అందించిన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. మహారాష్ట్ర లోని పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

‘ఇప్పుడు ప్రతి ఒక్కరు భారత్ వైపు చూస్తున్నారు. కొవిడ్ కట్టడికి మనం తీసుకున్న చర్యలే అందుకు కారణం. ప్రభుత్వం, వైద్య సిబ్బంది చేసిన కృషి, వైరస్‌ను తరిమికొట్టాలనే ఉమ్మడి లక్ష్యం వల్లే ఇది సాధ్యమైంది. నేను ప్రపంచ దేశాలన్నింటిని గమనించాను. కానీ మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో కొవిడ్ పరిస్థితి మెరుగ్గా ఉంది. ప్రతి ఒక్కరూ భారత్‌లోనే ఉండాలని కోరుతున్నాను’ అని పూనావాలా అన్నారు.

**10-15 రోజుల్లో కొవావ్యాక్స్..**

బూస్టర్ డోసుగా అందించేందుకు కొవావ్యాక్స్ టీకాకు 10-15రోజుల్లో అనుమతి వస్తుందని పూనావాలా వెల్లడించారు. ‘ఇది బూస్టర్‌గా ఉత్తమమైంది. కొవిషీల్డ్ కంటే ఒమిక్రాన్ మీద మెరుగ్గా పనిచేస్తుంది’ అని తెలిపారు. సీరమ్ సంస్థను ఉద్దేశించి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ట్వీట్ చేశారు. ‘కొవిడ్ సమయంలో సీరమ్ ఇనిస్టిట్యూట్ చేసిన కృషిని మేమంతా చూశాం. మా ప్రాణాలు కాపాడినందుకు ఈ దేశం తరఫున మీకు కృతజ్ఞతలు చెప్తున్నాం’ అని వెల్లడించారు. ఇదిలా ఉంటే .. ప్రస్తుతం చైనాతో సహా పలు దేశాల్లో కొవిడ్ వ్యాప్తి కనిపిస్తోంది. దాంతో కేంద్ర ఆరోగ్య శాఖ కూడా అప్రమత్తమైంది. ప్రజలెవరూ భయపడాల్సిన పనిలేదని, కొవిడ్ నిబంధనలు పాటించాలని సూచించింది.

# కుట్రపూరితం వీధి నాటకం!

ఒకనాడు కొండంత రాగం తీసిన మన తెలుగు పద్యనాటక వైభవం అంతరించిందని చింతించవలసిన అవసరం లేదు. రంగస్థలం మీద మహేంద్రజాలం చేయగలిగిన సురభి వారి ప్రజ్ఞాధురీణత మాయమైపోయిందని బాధ పడనవసరం లేదు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ వారు ఆ లోటును తీర్చేస్తున్నారు. నిజ రాజకీయాన్నే వీధి నాటకంగా మార్చి అధునాతన కళా కౌశలాన్నంతా అందులో రంగరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహకర్తగా రాబిన్‌సింగ్ అనే ఆయన వ్యవహరిస్తున్నారట! చంద్రబాబు సభలకు వస్తున్న జనం సంఖ్య, వారి స్పందన ఆయనకు నిరాశ కలిగించిందట!.

ఈ మేరకు పార్టీ నాయకత్వానికి తన అభిప్రాయాలను వ్యూహకర్త నివేదించారట. జనం నాయకుని కోసం ఎదురు చూస్తున్నట్టుగా, నాయకుని కోసం ఎగబడుతున్నట్టుగా చిక్కగా తనకు విజువల్స్ కావాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని అడిగారట. పార్టీ మేధో బృందం ఓ మూడు పద్ధతులను ఇందుకోసం రూపొందించింది. మొదటిది కుంభాకార దర్పణ టెక్నిక్. రెండోది ప్రలోభ టెక్నిక్, మూడోది కట్–ఎస్ట్ టెక్నిక్.

మొదటి పద్ధతికి ఉదాహరణ కందుకూరు విషాదం. కుంభాకార దర్పణం అంటే గోరంతను కొండంతగా చూపడమన్నమాట. సభకు వచ్చిన జనాన్ని పది పన్నెండింతలు పెంచి చూపెట్టే ప్రయత్నం. ఈ ప్రయోగం ఫలితమే కందుకూరు విషాదం. పోలీసులు అనుమతించిన సర్కిల్‌లోనే సభ జరిగి వుంటే ఎనిమిది ప్రాణాలు పోయేవి కాదు. కానీ సభ పేలవంగా జరిగినట్టు కనిపించేది. జనాకర్షణలో బాబు బలహీనత స్పష్టంగా తెలిసేది. అందుకని పక్కనే ఉన్న ఇరుకు సందులోకి వచ్చిన రెండువేల మందిని గొర్రెల మందను మళ్లించినట్టుగా తరిమేశారు. సందులో ఒత్తిడి పెరిగింది. వాళ్లు తిరిగి సర్కిల్‌లోకి రాకుండా చంద్రబాబు తన వాహనాన్ని 50 మీటర్లు ముందుకు ఉరికించి సందుకు అడ్డంగా నిలబెట్టారు. సీసా మూతికి బిరడా బిగించినట్టుగా తొక్కిసలాట మొదలైంది. అదే టీడీపీ బృందానికి కావల్సింది.హొ

రెండో టెక్నిక్‌ను ప్రయోగాత్మకంగా గుంటూరులో అమలు చేశారు. సమాజ సేవనే గాలిగా పేల్చుకునే ఒకానొక ఎన్ఆర్ఐ మహానుభావుడు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడని చెబుతున్నారు. ఆ వ్యక్తిపేరు ఉయ్యూరు శ్రీనివాస్. కార్యక్రమానికి అనుమతి మాత్రం టీడీపీ తీసుకున్నది. వచ్చివవాళ్లకు ఈ మహానుభావుడు చీరెసారెలు పంచుతారని పది రోజులపాటు ప్రచారం చేసుకున్నారు. సుమారు 30 వేలమందికి టోకెన్లు పంచారట. వచ్చినవాళ్లకు కానుకలు పంచకుండా చంద్రబాబు వచ్చేంతవరకు నాలుగు గంటలపాటు కూర్చోబెట్టారు. చంద్రబాబు ప్రసంగిస్తున్నంతసేపు డ్రోన్ కెమెరాలు వాటి పని అవి నిర్వర్తించాయి. 'బాబుకోసం తండోపతండాలుగా తరలివచ్చి ఆయన ఉపన్యాసాన్ని వింటున్న జనం' అనే కాన్సెప్టుకు తగినట్టు ఫోటోలు తయారుచేసుకున్నారు. పాపం వచ్చిన వారు మాత్రం 'చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీద' అన్నట్టుగా కానుకల కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు వెళ్లిపోయిన తర్వాత రెండువేల మందికి సరిపడా తెచ్చిన కానుకలను బిస్కెట్ల మాదిరిగా విసిరేశారు. ఫలితంగా దుర్ఘటన చోటుచేసుకున్నది. ఉయ్యూరు శ్రీనివాస్ తరహా సంఘసేవకులను మరో పదిహేను మందిని చంద్రబాబు సిద్ధం చేసి ఉంచారని చెబుతున్నారు. ఎన్నికలయ్యేవరకు నెలకొకరు చొప్పున గుంటూరు తరహా చీరెసారెల సభలు నిర్వహించాలి. అందుకుగాను సదరు సేవకుల అభిరుచిని బట్టి ఎమ్మెల్యే టిక్కెట్లు గానీ, గెలిస్తే కాంట్రాక్టులు గానీ హామీ ఇచ్చారట!.

ఇక మూడో టెక్నిక్ – 'కాపీ–స్ట్' పద్ధతి. బహుశా సోషల్ మీడియాకే పరిమితం చేస్తారు కాబోలు. కర్ణాటకలో సిద్ధేశ్వర స్వామి అనే మఠాధిపతి చనిపోతే ఆయన అంతిమయాత్రకు రెండు లక్షలమంది హాజరయ్యారు. ఆ ఫోటోను తెచ్చి చంద్రబాబు కుప్పం పర్యటనలో పాల్గొన్న జనసందోహమంటూ ప్రచారంలో పెట్టారు. ఎవరూ కనిపెట్టి కౌంటర్ చేయకపోతే ఇటువంటి ఫోటోలతో సోషల్ మీడియా ప్రచారం ముమ్మరంగా సాగించే అవకాశమున్నది. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఏదో ఒకరోజున అన్నాదురై అంతిమయాత్ర ఫోటో కూడా టీడీపీ ఖాతాలో పడుతుందేమోనని భయంగా ఉన్నది. కోటిన్నర మంది పాల్గొని ప్రపంచంలోనే అతిపెద్ద జనసందోహంగా రికార్డయిన ఘట్టమది.

చంద్రబాబునాయుడు కుట్రపూరిత రాజకీయాల గురించి, ఆయన గురువింద నీతిపై తెరలు కప్పే ఎల్లో మీడియా మ్యాజిక్ గురించి తెలుగు ప్రజల్లో చాలామందికి తెలుసు. కానీ, ఇప్పుడు జరుగుతున్న కుట్ర మరింత ప్రమాదకరమైనది. ఈ కుట్రకు సంబంధించిన అంశాలు ఒక్కటొక్కటే ఆవిష్కృతమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని సంపన్న వర్గాలు... ముఖ్యంగా రెండున్నర పాత జిల్లాల సంపన్నవర్గాల కనుసన్నల్లో ఈ దారుణమైన కుట్ర పురుడుపోసుకున్నది. ఈ వర్గాల ప్రయోజనాలకోసం భుజంకాసే నాయకత్వ శ్రేణులు కుడినుంచి ఎడమకు అన్ని పార్టీల్లోనూ ఉన్నారు. సాంస్కృతిక సాహిత్య రంగాల నుంచి ప్రజాసంఘాల వరకు విస్తరించి ఉన్నారు. వివిధ వృత్తి సంఘాల్లోనూ పాతుకొనిపోయి ఉన్నారు. రకరకాల వ్యవస్థల్లో స్లీపర్‌సెల్స్ అవతారంలో పొంచి ఉన్నారు. కుట్రకు సంబంధించిన ప్రణాళిక, అందులో భాగస్వాములు పోషించవలసిన పాత్రల గురించి మార్గదర్శకాలు ఇప్పటికే అందరికీ జారీ అయ్యాయి. ఇంతకూ ఏమిటా కుట్ర?.

ఆంధ్రరాష్ట్ర సహజ వనరులనూ, ఆదాయాలను ఇంతకాలంగా దోచుకు తింటున్న కొన్ని పందికొక్కులకు ఇప్పుడు ఊపిరి సలపడంలేదు. వాటికి 'మేత' దొరకడం లేదు. ఆ 'మేత'కు అభివృద్ధి అనే అందమైన పేరును పందికొక్కులు తగిలించుకున్నాయి. 'అభివృద్ధి ఎక్కడుందీ?' అని అవి ప్రశ్నిస్తున్నాయి. 'ఔనౌను అభివృద్ధే కానరావడం లేద'ని ఈ 'మేత' కొక్కులకు వంతపాడే నేతలంతా అభిప్రాయపడుతున్నారు. ఎల్లో మీడియా అదే పాట పాడుతున్నది. దాని అనుబంధ సోషల్ మీడియా కోరస్ పాడుతున్నది. రెండు లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారులకు ప్రత్యక్షంగా బదిలీ చేస్తే పందికొక్కులు తవ్వుకునేదెట్లా? ఇంకో లక్షన్నర కోట్లను నవరత్నాల పేరుతో పేదవర్గాల సాధికారతకు ఖర్చు పెడితే పందికొక్కులు చిక్కిపోవా? విద్య, వైద్యం, వ్యవసాయం, చిన్న పరిశ్రమల పునరుజ్జీవం కోసం వేలకోట్లు ధారపోస్తుంటే తాము మింగేందుకు ఏం మిగులుతుంది? పతితులుగా, భ్రష్టులుగా, దగాపడిన తమ్ములుగా ముద్ర వేయించుకున్న నిరుపేదలు నిటారుగా నిలబడితే, మనుషులుగా బలపడితే చీప్ లేబర్ దొరికేదెట్లా? వనరులన్నింటినీ తమ చేతికి అందివ్వకుండా, ఆదాయాన్ని తమ నోట్లో కుక్కకుండా, చీప్ లేబర్ దొరక్కుండా ప్రభుత్వమే పూనుకుంటే ఇక 'అభివృద్ధి' ఎట్లా? ఇదే ఇప్పుడు అభివృద్ధిపై జరుగుతున్న తర్కవితర్కం.

# వైసీపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన ఆదర్శ సంక్షేమ పాలన అందిస్తుంది : మంత్రి జోగి రమేష్



**(వి న్యూస్ పెడన):** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన ఆదర్శ సంక్షేమ పాలన అందిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గంలో ఎంతో ఉత్సాహంగా సాగుతోంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గూడూరు మండల పరిధిలో 14 క్లస్టర్లు 1008 మంది ప్రజలున్న కప్పలదొడ్డి గ్రామంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా పర్యటించారు. తొలుత ఆయన కప్పలదొడ్డి గ్రామంలో కొఠారి వెంకటేశ్వరమ్మ, కొఠారి సావిత్రి, ఉమ్మడి కే జ్యోతి, మేడక జ్ఞానేశ్వరి, పేరిశెట్టి జ్ఞాన కోటయ్య, బళ్ళ కోటేశ్వరరావు, బళ్ళా గౌరమ్మ, పేరిశెట్టి పటేల్ బాబు, ఉక్కెం నాగమాలతి, కొఠారి ధనలక్ష్మి, బట్ట కోటేశ్వరరావు, పేరిశెట్టి జ్ఞానాంబిక, పేరిశెట్టి జగదీశ్వరి, గుత్తి ధనలక్ష్మి, గుత్తి అన్నపూర్ణ,నల్లపురెడ్డి వెంకటరత్నం, సేనాపతి శివయ్య, ఉక్కెం శ్రీలక్ష్మి, బట్ట మీనాక్షి, బట్ట హేమాక్షి, పేరిశెట్టి లక్ష్మీరాజ్యం, కోలుకుల నాగేంద్రం తదితరుల గృహాలకు మంత్రి జోగి రమేష్ సందర్శించి అందర్నీ ఆప్యాయంగా పలకరించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ప్రజలు పొందిన లబ్ధి వివరాలతో కూడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేశారు. జగనన్న ప్రభుత్వం రావడం వలన మీకు ఇన్నిన్ని ప్రయోజనాలు చేకూరడం జరుగుతుందని అలానే పెడన నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. సేనాపతి ఫణి కుమార్ అనే విద్యార్థి మంత్రి జోగి రమేష్ తో మాట్లాడుతూ, తాను గుడ్లవల్లేరులో పాలిటెక్నిక్ చదువుతున్నానని, బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో 18 ఏళ్ళ వయసు కేటగిరీలో కృష్ణాజిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించానని, తనకు సరైన బాల్ బ్యాడ్మింటన్ రాకెట్ లేదని తెలిపాడు. వెంటనే స్పందించిన మంత్రి ఆ క్రీడాకారునికి నాణ్యతతో కూడిన ఖరీదైన బ్యాట్ను వెంటనే కొనివ్వాలని తన వ్యక్తిగత కార్యదర్శికిహొసూచించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ, సాధారణంగా మూడున్నర ఏళ్ల పరిపాలన పూర్తయిన తర్వాత ప్రజల్లోకి వెళితే గ్రామాల్లో అనేక సమస్యలు చెబుతారని, కానీ అలాంటి పరిస్థితి లేకుండా ఏ గడపకు వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని, అర్హత ఒకటే ప్రామాణికంగా అన్ని రకాల సంక్షేమ పథకాలను సంతృప్తికర స్థాయిలో అందజేశామని, అందుకే స్వేచ్ఛగా, స్వాతంత్ర్యంగా ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. గ్రామాలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇల్లు లేని పేదలకు ఇల్లు మంజూరు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లకు కూడా పొజిషన్ సర్టిఫికెట్లు అందిస్తున్నామని, ఇంటి నిర్మాణానికి కూడా త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. కులమతాలు, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడం, సాంకేతిక కారణాలతో ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే అందించడమే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కప్పలదొడ్డి గ్రామ సర్పంచ్ యక్కల మాధవి నాగరాజు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదన రావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గోరిపర్తి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మోటేపల్లి రత్నాకర రావు, వైస్సార్ సీపీ సీనియర్ నాయకులు తలుపుల వెంకటకృష్ణారావు, పిచ్చుక గంగాధర రావు, గూడూరు తహసిల్దార్ విజయ ప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు, హౌసింగ్ డిఈ అడుసుమిల్లి శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10 నుండి ప్రజలకు అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967



**(వి న్యూస్ మచిలీపట్నం):** ఈ నెల 10వ తేదీ నుండి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెంబర్ 1967 రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి వస్తుందని జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జూలై, 20 నుండి అమలులోకి వచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం వినియోగదారులకు హక్కులను కల్పిస్తూ వారిలో బాధ్యతా , చైతన్యం తీసుకురావడం కోసం అనేక చర్యలు చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయం నందు ప్రజలు, వినియోగదారులు మరియు ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారం చూపుటకు గాను ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ టోల్ ఫ్రీ నెంబర్లుహొ1800 425 0082 / 1967 (పౌర సరఫరాల శాఖ ) 1800 425 3157/ 14445 (ఒకే దేశం ఒకే రేషన్కార్డు) 1800 425 2388/ 155235 రాష్ట్ర ఆహార కమీషన్ ) 18004254202 (తూనికలు కొలతల శాఖ) పై తెలిపిన అన్ని టోల్ ఫ్రీ నెంబర్లను 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెంబర్ గా అనుసంధానం చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ప్రజలు, వినియోగదారులు ఈ కాల్ సెంటర్ నెంబరుకు ఫోన్ చేసి ప్రజాపంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికలు కొలతలు, బియ్యం కార్డు సేవలు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ నెంబర్ ఈనెల 10వ తేదీ నుండి అందుబాటులోకి వస్తున్నదని, ప్రతి రోజు ఆఫీసు పనివేళల్లో ఉ. 10 గం.ల నుండి సా. 6 గం.ల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కావున ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకొని తమ ఫిర్యాదులను పరిష్కార నిమిత్తం తెలియజేయవలసిందిగా కోరారు.

# రచయిత్రి ధనాశి ఉషారాణి ఇండియన్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ లో స్టేట్ వైస్ చైర్మన్ గా ఎన్నిక



**(వి న్యూస్ తిరుపతి):** తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట కు చెందిన రచయిత్రి ధనాశి ఉషారాణి వివిధ నూతన ప్రక్రియలు రూపొందిస్తూ సాహిత్యంలో సమాజ సేవలో వివిధ కార్యక్రమాల్లో చేస్తున్న కృషికి గాను ఇండియన్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ లో ఆంధ్రప్రదేశ్ వారు రచయిత్రి ధనాశి ఉషారాణి ని స్టేట్ వైస్ చైర్మన్ గాను నియమిస్తున్నట్టు నేషనల్ లీగల్ అడ్వైసర్ అనిల్ కుమార్ యాదవ్ , షాహ గయసుల్ హసన్ లీగల్ అడ్వైసర్ తెలియజేసారు.గత సంవత్సరంలో చిత్తూరు జిల్లా ప్రెసిడెంట్ గాను హ్యూమన్ రైట్ కౌన్సిల్ లో సేవలు అందించారు.

# మ్యానువల్ పద్ధతిలో పోలీస్ నియామకాలు చేపట్టాలి అక్రమ అరెస్టులను ఖండించాలి - ధర్మారపు సాంబమూర్తి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

**(వి న్యూస్ వరంగల్):** రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పోలీస్ విభాగంలో నియామకాలు చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం కానీ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ విధంగా పోలీసు నియామకాలను చేపట్టిన దాఖలాలు లేవు ఎన్నడూ ఎరగని రీతిలో పోలీసు నియమకాలను డిజిటలైజేషన్ పద్ధతిలో కొలుస్తూ గతంలో మ్యానువల్ పద్ధతిలో క్వాలిఫై అయినటువంటి అభ్యర్థులు డిజిటలైజేషన్ ద్వారా కొలతలు తీసుకోవడం ద్వారా డిస్ క్వాలిఫై అవుతున్నటువంటి పరిస్థితి కనబడుతోంది వారికి నిజంగా న్యాయం జరగాలంటే మరల మ్యాన్యువల్ పద్ధతిలోనే కొలతలు తీసుకోవాలని అదేవిధంగా 800 1600 మీటర్లు క్వాలిఫై అయినటువంటి అభ్యర్థులను మెన్స్ కి అనుమతి ఇవ్వాలని ఈ పెంచినటువంటి షాట్ పుట్ గాని లాంగ్ జంపు గాని తగ్గించి గతంలో ఏ విధంగా అయితే నియమకాలు చేపట్టేదో అదే స్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో నియమకాలు చేపట్టాలని గత రెండు నెలలుగా ఉన్నటువంటి అధికారులు అందరికీ కూడా రెప్రెటేషన్లు ఇవ్వడం కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ అధికారులు గానీ ఇచ్చినటువంటి మెమోరాన్డాలకు కనీస గౌరవం ఇవ్వకుండా కేవలం వారికి నచ్చిన పద్ధతిలోనే నియమకాలను చేపట్టడం జరుగుతుంది ఈ విధంగా చేయడం వల్ల ఈ మధ్యకాలంలో అనేక మంది యువకులు ఆత్మహత్యలు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితమే వరంగల్ జిల్లా సింగార ప్రాంతానికి చెందిన రాజ్ కుమార్ అనే వ్యక్తి కూడా తన ప్రాణాలను



కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది యువకులు అనేకమంది ఈ విధంగా తన ప్రాణాలను కోల్పోతున్న ఎటువంటి చలనం లేనటువంటి రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుంది వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమస్యపరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్రప్రజాసంఘాల పిలుపులో భాగంగా హైదరాబాద్ ప్రగతి భవన్ ని ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది దీన్ని అడ్డుకునే ప్రయత్నంలో నిన్న రాత్రి నుండే అన్ని జిల్లా కేంద్రాలలో ఉన్నటువంటి ప్రజా సంఘాల నాయకులను కార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్టులు చేస్తూ ఉద్యమాలను ఆపే ప్రయత్నం చేస్తున్నారు ప్రభుత్వం ఎన్ని పన్నాగాలుపన్నిన ఉద్యమాలను ఉధృతం చేసే దిశగా ప్రగతి భవన్ ముట్టడికి ప్రయత్నించినటువంటి నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది వారందరిని కూడా విడిచి పెట్టాలని లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగులు అందరిని కూడా కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాని బి. సాంబమూర్తి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మామ నూరి అనూష తాళ్లపల్లి అరుణ మహమ్మద్ రజియా తాత స్వాతి నలగంటి రజిని పూజ సతీష్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం...



**(వి న్యూస్ మర్రిపాడు):** ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం లో భాగంగా సోమవారం మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మండల మెడికల్ ఆఫీసర్ డా.కల్పన 35మంది గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు వైద్య ఆరోగ్య సిబ్బంది సలహాలు పాటించి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ కల్పన తెలియజేసారు ప్రతినెల తప్పని సరిగా వైద్యాధికారి చే పరీక్షలు చేయించుకోవాలని, పౌష్ఠిక ఆహారం తీసుకోవాలని, ఐరన్ మాత్రలు తప్పక వేసుకోవాలని, ఆకు కూరలు, చేపలు, గుడ్లు మొదలైన ఆహారం తీసుకోవాలని సూచించారు ప్రభుత్వ పథకాలను వినియోగించు కోవాలని సూచించారు. మొదటి గర్భానికి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం క్రింద 5 వేల రూపాయలు ఇస్తారని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత ప్రసవం చేస్తారని, 102 తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ నందు ఉచితంగా ఇంటి వద్ద వదలుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో35 మంది గర్భవతులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.కల్పన , వైద్య విస్తరణ అధికారులు కొండారెడ్డి,జావీద్, సూపర్ వైజర్లు,ఖాజామోహిద్దీన్,సైదా, సామాజిక ఆరోగ్య అధికారి రోజ్లిన్,ఆరోగ్య పర్యవేక్షకులు తిరుపతమ్మ,విజయమ్మ ఏ.ఎన్. ఎమ్ వేలంగణ్ణి,,నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పదం వైపు తీసుకు వెళుతున్నారు - ఎమ్మెల్యే వంశీ

**(వి న్యూస్ హనుమాన్ జంక్షన్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పదం వైపు తీసుకు వెళుతున్నారని గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడు 2 ఇందిరానగర్ లో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని పుస్తక రూపంలో అందించటమే కాకుండా ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. తమ తమ ఆవేదన వెలిబుచ్చిన వృద్ధులకు నిరుపేదలకు ఎమ్మెల్యే వంశీ తన సొంత నిధుల నుండి ఆర్థిక సహాయం అందించి వారిని ఆదుకుంటున్నారు. గడప గడపలో ప్రజలు చెప్పే సమస్యలు తెలుసుకుని క్షణాల్లో పరిష్కార మార్గం చూపిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల డబ్బు జమ చేయడం, పార్టీతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటం మామూలు విషయం కాదన్నారు. జగనన్న పాలనపై రాష్ట్ర ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని వంశీ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిపల్లి కమలా భాయ్, ఎంపీపీ యరగొర్ల నగేష్ , జడ్పిటిసి కొమరవల్లి గంగా భవాని, మండల పార్టీ అధ్యక్షులు నక్కా గాంధీ, కన్వీనర్, అవిర్నేని శేషగిరిరావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, ఎండిఓ కే.ప్రభాకర్ రావు, బాపులపాడు పంచాయతీ సెక్రెటరీ సి వి ఎల్ ఎస్ ఆర్ వి ప్రసాద్, హనుమాన్ జంక్షన్ ఎస్సై తోట సూర్య శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు కొమరవల్లి కిరణ్ మూర్తి, పెరికిడు మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి, ఎంపీటీసీలు సచివాలయ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత తో మెలగాలి: మాజీ మంత్రులు కామినేని, కొల్లు, పిన్నమనేని..




**(వి న్యూస్, కైకలూరు) :** స్థానిక మండల కేంద్ర పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ కు ఎదురుగా గల, విద్యాంజలి డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రారంభించి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా సోమవారం కళాశాల ప్రాంగణం నందు రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, కామినేని శ్రీనివాస్, పిన్నమనేని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు అధ్యక్షతన నిర్వహించిన సభను ఉద్దేశించి వారు మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తో మెలగాలని, విద్యాభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి జరుగుతుందని, ప్రస్తుత టెక్నాలజీ విధానాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలని సూచించడం జరిగింది. అదేవిధంగా ఎదిగిన కొద్ది ఒదిగి ఒదిగి ఉండాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జయ మంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, మాజీ జడ్పిటిసి బొమ్మన బోయిన విజయలక్ష్మి, కైకలూరు సర్పంచ్ మేరీ నవరత్నకుమారి, బిజెపి నాయకులు లావేటి వీర శివాజీ, సామాజికవేత్త చింతపల్లి వెంకటనారాయణ మాట్లాడుతూ, మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత ప్రాధాన్యమైన దశగా వారు అభివర్ణించడం జరిగింది. ఈ దశనందు ప్రతి విద్యార్థి నిర్దిష్టమైన ప్రణాళికలను రచించుకుని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు కేవీఎం నాయుడు, బి కె యం నాని, తెదేపా నాయకులు మాల్యాద్రి, జనసేన నాయకులు ఎన్. వి. ఆర్ పేర్రాజు, కళాశాల పూర్వ విద్యార్థులు మరియు కళాశాల ప్రిన్సిపాల్ జమీల్ అహ్మద్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 34వ డివిజన్ లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం




**(వి న్యూస్ విజయవాడ):** జగన్ పాలనలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం టీడీపీ 34వ డివిజన్ అధ్యక్షురాలు షేక్ తశ్లీం భాను, ప్రధాన కార్యదర్శి అలగాల శ్రీనివాసరావు నాయకత్వంలో క్లస్టర్ ఇంఛార్జి షేక్ హాబీబ్ యూనిట్ ఇంఛార్జిలు దాకరపు మరియన్న దాసు, ఏకుల రత్నం ఆధ్వర్యంలో మసీదు సెంటర్ వద్ద నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మైనారిటీ నాయకులు ఎమ్ ఎస్ బేగ్, రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఇరవై రోజులుగా నియోజకవర్గంలో 17 డివిజన్ లో పార్టీ నాయకుల ద్వారా 8వేల కుటుంబాలను కలిసి, ప్రజల నుంచి 3వేలకు పైగా సమస్యల్ని సేకరించామన్నారు. వచ్చిన సమస్యలో అత్యధికంగా ఫించన్లు, రేషన్ కార్డులు తొలగించారని, స్థానిక సమస్యలు తెలుసుకున్నారని తెలిపారు. ఎంపీ కేశినేని నాని సూచనలతో వారికి న్యాయం జరిగేలా ప్రజా ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎమ్ ఎస్ బేగ్, క్లస్టర్ ఇంఛార్జి షేక్ హబీబ్, డివిజన్ అధ్యక్షులు షేక్ తస్లీమా భాను, డివిజన్ నాయకులు ఏకుల రత్నం, వర్లగంటి వీరబాబు, యర్ర సాంబ, సక్కిరాల దుర్గారావు, యర్రా పోలమ్మ, రవ్వవరపు రమేష్, హుస్సేన్, సేతుపతి దీనా, కర్రా చంద్రశేఖర్, ఆలగిరి సురేష్, పురం ప్రసన్న కుమార్, మల్లేశ్వరరావు, టీం టిడిపి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొని మద్దతు పలికారు.

# జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గా గంగుల...




**(వి న్యూస్ కైకలూరు):** ఈనెల 8వ తారీఖున విజయవాడలో జరిగిన, జాతీయ బిసి సంక్షేమ సంఘం మూడు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరైన, కైకలూరు మండలం పల్లెవాడ గ్రామానికి చెందిన జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గంగుల అశోక్ ను, బిసి సంక్షేమ సంఘంనకు గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శి గా నియామిస్తూ, రాష్ట్ర అధ్యక్షుడు లకా వెంగళరావు ఉత్తర్వులు జారీచేసారు. ఈ సందర్భంగా గంగుల అశోక్ మాట్లాడుతూ, తనకు ఇచ్చిన ఈ పదవికి తగిన న్యాయం చేస్తానని,జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆశయాలకు అనుగుణంగా ఆయన అడుగు జాడల్లో నడుస్తానని, సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు, తనకు పదవి రావడానికి కారకులు అయినా రాష్ట్ర కన్వీనర్ యలగాల నూకనమ్మ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని అన్నారు.

# వా జాతీయ క్రీడలే లక్ష్యంగా శాప్ పని చేస్తుంది.

## - మచిలీపట్నంలో నూతన వ్యాయామశాల, స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్ధ రెడ్డి



**(వి న్యూస్ మచిలీపట్నం):** జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోనే కాకుండా గోవాలో జరగనున్న జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు పథకాలు సాధించడమే లక్ష్యంగా శాప్ నిరంతరంగా పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్ధ రెడ్డి అన్నారు.స్థానిక జిల్లాపరిషత్ సెంటర్ లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన స్విమ్మింగ్ పూల్, నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామశాలను సోమవారం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్దార్ధ రెడ్డి మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య(నాని) తనయుడు పేర్ని కిట్టుతో కలసి ప్రారంభోత్సవం చేశారు. జిమ్ పరికరాలను పరిశీలించడంతో పాటు ట్రెడ్మిల్పై నడిచి పనితీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పునరుద్దరించిన స్విమ్మింగ్ పూల్, నూతన వ్యాయామశాల ప్రారంభోత్సవానికి తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహంతో శాప్ ఆధ్వర్యంలో నిరంతరం ఏదో ఒక క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇటీవల కాలంలో జగనన్న క్రీడా సంబరాలు, శాప్టాగ్లు, సీఎం కప్, జాతీయ క్రీడలు ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి వైయస్ ఆర్ క్రీడా ప్రోత్సహాలు అందిస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు స్పోర్ట్స్ అకాడమీల కోసం స్థలాలను కేటాయించామని అన్నారు. ఎక్కువ మంది క్రీడాకారులకు అవకాశాలు దక్కాల నే ఉద్దేశ్యంతో ఎక్కువ స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని, పర్యవసానంగా ఎక్కువ ఫలితాలు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ వేసవి కాలంలో వివిధ క్రీడాంశాలలో టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు పేర్ని నాని కృషి మేరకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మచిలీపట్నంలో శాపక్కు 2 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, దానికి నిధులు సమకూర్చి ఆ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మించి బ్యాడ్మింటన్ కోర్టులు, ఇతర క్రీడల నిర్వహణకు అనుకూలంగా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడానికి వివిధ క్రీడాంశాల టోర్నమెంట్లను నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థలు, మాజీ క్రీడాకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాప్ చైర్మన్కు కార్పోరేటర్లు, వైయస్ఆర్ పార్టీ నాయకులు, అభిమానులు ముందుగా ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందుగా కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ పి. జాషువాలను శాప్ చైర్మన్ మర్యాధ పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ లంకా నూరిబాబు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె.జాన్సీలక్ష్మీ, కార్పోరేటర్లు, వైయస్ఆర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి ఆధ్వర్యంలో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి



**(వి న్యూస్ హనుమాన్ జంక్షన్):** టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి ఎమ్మెల్సీ, బచ్చుల అర్జునుడు పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రమైన హనుమాన్ జంక్షన్ లో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గత మూడున్నర ఏళ్లుగా జగన్ రెడ్డి హయాంలో తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రం ద్వారా ప్రజల నుండి లిఖిత పూర్వకముగా తీసుకున్న తర్వాత వారి మొబైల్ నెంబర్ నుండి మాతో కలిసి పోరాడేందుకు "9261292612" నెంబర్ కి మిస్డ్ కాల్ ఇచ్చి ఈ వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు నిరసన తెలియజేయడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలు దేశవ్యాప్తంగా తీసుకు వెళుతున్నట్లు సాయి కళ్యాణి తెలిపారు.

# కోడి పందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం - జిల్లా కలెక్టర్



**(వి న్యూస్ మచిలీపట్నం):** సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, కోడి పందేలు, జూదక్రీడలు నిర్వహించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం తన చాంబర్ లో సంక్రాంతి పండుగ సందర్భంగా చట్టవిరుద్ధంగా నిర్వహించే కోడి పందేలు, జూద క్రీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన జిల్లా ఎస్పీ పి. జాషువాతో కలసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కోడి పందేలు నిర్వహించుట, పాల్గొనుట చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10 ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్ 34 జంతుహింస నివారణా చట్టం 1960 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, గతంలో కోడి పందేలు నిర్వహించే వారిని, కత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు నమోను చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కోడి పందేలు జరుగుతున్నాయన్న సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి బరిలను ధ్వంసం చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కోడి పందేలు నిర్వహించుట, పాల్గొనుట చట్టరీత్యా నేరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, బందరు డిఎస్పీ మాసూం బాషా, జడ్ పీ సిఇఓ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడి కె.చంద్రశేఖర్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల ఆర్డీఓలు ఐ.కిషోర్, పి.పద్మావతి, విజయకుమార్, డిఎల్ ఒ డి.సుబ్బారావు, స్థానిక గోసాల నిర్వాహకులు పల్లబోతు సుబ్రహమణ్యం, మున్సిపల్ కమీషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్.
9246761404
08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును.
సంప్రదించండి:
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్
గొడుగుపేట-మచిలీపట్నం
సెల్:9182197822
9121605277

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
సంప్రదించండి
9848667347

శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును.
సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347




**అమ్మబడును**
మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి:
సెల్: 7032931205
సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే
బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822

**వంట మనిషి కావలెను**
మచిలీపట్నం జల్లువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్)
సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల)
సెల్:7032931205

# రేప్ కేసు కొట్టివేత

**(వి న్యూస్ మచిలీపట్నం):** రేప్ కేస్ కొట్టివేత అత్యాచారం కేసులో ఇరువురు నిందితులపై నేరం నిరూపణ కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ కృష్ణా జిల్లా 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సోమవారం తీర్పు చెప్పారు. బందరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని కోన గ్రామానికి చెందిన 22 సంవత్సరాల యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించి తనపై 2021 జనవరి 23వ తేదీన కోన గ్రామంలో అత్యాచారము జరిపినట్లు ప్రథమ ముద్దాయి కోమటి రామాంజనేయులు(25) పైన అతని ఈ సహకరించిన అతని బంధువు కోమటి నాగబాబుపై(25) ఆ యువతి ఫిర్యాదు చేసింది. బందరు తాలూకా పోలీసులు అత్యాచారం, చీటింగ్ కేసు కింద కేసును నమోదు చేశారు. ఈ కేసును అప్పటి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దర్యాప్తు చేసి చార్జింగ్ దాఖలు చేశారు. కేసు విచారణ లో ఉండగా ప్రధాన నిందితుడు కోమటి రామాంజనేయులు ఆ ఫిర్యాదినీ వివాహం చేసుకోవడంతో పెద్దల మధ్య కేసు రాజీ కుదిరింది. కేసు విచారణలో నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుల తరఫున లంకిశెట్టి బాలాజీ,కడవకొల్లు విజయకుమార్ న్యాయవాదులుగా వ్యవహరించారు.

# విశాల దృక్పథమే స్వామి వివేకానంద రచనలు-భావాలు : ఇంతియాజ్



**(వి న్యూస్ విజయవాడ):** భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన స్వామి వివేకానందుని భోధనలు, భావాలు ముందు తరానికి అందించాలని ఎ.పి. మైనారిటీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ ఇంతియాజ్ పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం విజయవాడ లబ్బీపేట లోని నలంద డిగ్రీ కళాశాల నందు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సమాజ సేవకులకు “స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డు” ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయలతోపాటు వివేకానంద విశాల దృక్పథమే ఆయన రచనలు, ఉపన్యాసాలలో ప్రతిఫలిస్తుంది వివరించారు. అనంతరం అవార్డు గ్రహీతలు వి.వెంకటేశ్వరరావు(విజయవాడ ), డి.ఆంజనేయ ప్రసాద్ (హైదరాబాద్ ), ఎస్.రవీంద్ర రెడ్డి (పలమనేరు), వై.శ్రీలక్ష్మి (విజయవాడ), షేక్ రఫియా బేగం (విజయవాడ) లను శాలువా, కిరీటం, మొమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి వేముల హజరత్తయ్య సభాధ్యక్షులు గా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీమోహన్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.అనురాధ, వి.కె. ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ వన్ రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం



**(వి న్యూస్ బంటిమిల్లి):** సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ రద్దు చేయాలని కోరుతూ కామ్రేడ్ గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన పార్టీ సిపిఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బొల్లా వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పరిపాలన జరుగుతుందని ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ తీసుకొచ్చే విధంగా జీవో నెంబర్ ఒకటిని తీసుకొచ్చారని తెలుగుదేశం పార్టీ ప్రజాదరణ చూడలేక ముఖ్యమంత్రి జీవో తీసుకొచ్చారని అన్నారు జనసేన పార్టీ మండల అధ్యక్షులు ర్యాలీ సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ రద్దు చేయాలని లేని పక్షంలో అఖిలపక్షంగా పోరాటాల్లో పాల్గొంటామని అన్నారు అన్నారు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు పరుచూరి ధనశ్రీ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థకే మచ్చ తెచ్చిందని నిరసన తెలియజేసే తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎక్స్ ఎన్ పి టి సి జొన్నలగడ్డ కొండ సిపిఎం నాయకులు బొడ్డు నాగరాజు వంగల రాజు పొదిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా జాతీయ బాలకార్మిక ప్రాజెక్ట్ రూ .9,57,000 / -ల నిధులు దుర్వినియోగం

## - రాష్ట్ర లోకాయుక్త న్యాయమూర్తి పి . లక్ష్మణరెడ్డికి నివేదిక సమర్పించిన ఎ.సి.బి. డైరక్టర్ జనరల్

## - క్రిమినల్ ప్రాసిక్యూషన్ కు కృష్ణాజిల్లా కలెక్టరు ను ఆదేశించిన రాష్ట్ర లోకాయుక్త



Andhra Pradesh Lokayutka Justice
P. Lakshman Reddy Garu

**(వి న్యూస్ విజయవాడ):** కృష్ణాజిల్లా, జాతీయ బాలకార్మిక ప్రాజెక్ట్ రూ .9,57,000 / -లు నిధులు దుర్వినియోగం జరిగనట్లు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరక్టర్ జనరల్ రాష్ట్ర లోకాయుక్త న్యాయమూర్తి పి . లక్ష్మణరెడ్డిగారికి నివేదిక సమర్పించారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ సోమవారంనాడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రంజితాభాషాను క్రిమినల్ ప్రాసిక్యూషన్ కొరకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశించారు. జాతీయ బాలకార్మిక ప్రాజెక్ట్ కృష్ణాజిల్లా డైరక్టర్ డి.ఆంజనేయరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజరు కె.ప్రసూనాంబ ప్రాజెక్ట్ నిధులను, బాలకార్మికుల పాఠశాలలో ఒకేషనల్ టీచర్లుగా ఉద్యోగాలు చేయని జి.అప్పారావు, కళ్ళేపల్లి లక్ష్మీసుజాత పేర్లతో రూ . 9,57,000 / -లు నిధులును డ్రా చేయటం జరిగింది. ఈ నిధులు దుర్వినియోగం ది.01-04-2015 నుండి ది . 30-06-2020 సంవత్సరాల్లో జరిగింది. లోకాయుక్త ఎ.సి.బి. డైరక్టర్ జనరల్ నివేదికను పరిశీలించిన మేరకు కృష్ణాజిల్లా కలెక్టర్ నః క్రిమినల్ ప్రాసిక్యూషన్ నిర్వహించి, రూ . 9,57,000 / -లు నిధులును రాబట్టి, ది . 19-01-2023 లోపు నివేదికను సమర్పించాల్సిందిగా ఆదేశించారు. సామాజిక కార్య కర్త జంపాన శ్రీనివాస గౌడ్ జూన్ 2021 లో చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణకు ఆదేశించారు.

# వృత్తి విద్య తో ఉద్యోగ అవకాశాలు



(వి న్యూస్, మచిలీపట్నం): ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సులు చదివిన విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వపరంగా అందుబాటులో ఉన్నాయని మచిలీపట్నం వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాల విద్యార్థునీలు గత నెల రోజులుగా వాణిజ్య పనుల కార్యాలయంలో ఉపాధి శిక్షణ పొందుతూ సోమవారం ఏర్పాటుచేసిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తి విద్యా కోర్సులు చదవటం వల్ల విద్యార్థునీలు చిన్న వయసులోనే ఆర్థికంగా సంపాదించుకునే అవకాశం కలుగుతుందని, జిల్లా ప్రభుత్వ లేడీ యంప్త్ ల్ కళాశాలలో ఈ కోర్సులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వారికి వెంకటేశ్వరరావు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు, అసిస్టెంట్ కమిషనర్ భార్గవి కళాశాల అధ్యాపకులు లంకిశెట్టి హరనాథ్ బాబు, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలలో కాన్సర్ పరీక్షల కోసం త్వరలో ఆధునిక మొబైల్ ల్యాబ్ -ఎం పి బాలశౌరి



**(వి న్యూస్ మచిలీపట్నం):** గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా మహిళల్లో వివిధ కాన్సర్ లు పెరుగుతున్న దృష్ట్యా ముందు జాగ్రత్త గా వారి వద్దకే వెళ్లి స్క్రీనింగ్ చేసేందుకు అవసరమైన ఒక అధునాతన మొబైల్ ల్యాబ్ ను మచిలీపట్నం ప్రాంతంలో స్థానిక భారత్ ఎలెక్ట్రానిక్స్ లిమిటెడ్ వారి సి ఎస్ ఆర్ నిధులు , మచిలీపట్నం పార్లమెంట్ సభ్యునిహొఎం పి ఎల్ ఏ డి ఎస్హొనిధులతోనూ ఏర్పాటు చేస్తున్నట్లు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అత్యంత ఆధునిక యంత్ర పరికరాలు ఉన్న ఈ మొబైల్ ల్యాబ్ లో వివిధ పరీక్షలతో పాటు కాన్సర్ అనుమానిత లక్షణాలు కనిపిస్తే, వెంటనే పరీక్ష కోసం శరీరం నుండి నమూనాలు సేకరిస్తారు. ఈ నమూనాల ద్వారా కాన్సర్ ఉందొ లేదో తెలిసిపోతుంది కాబట్టి వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే తగిన చికిత్స ను సూచించడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల లోని పేద మహిళలు చాలామంది తమ యొక్క అనారోగ్య సమస్యలను చెప్పుకోవడానికి సంకోచిస్తూ ఉంటారు. వారి యొక్క ఆర్థిక, సామజికహొ, కుటుంబ పరిస్థితులే ఇందుకు కారణం అయి ఉంటాయి. దీనితో వ్యాధి ముదురుతున్నా పట్టించుకోరు. అదే వారు ఉండే ప్రాంతానికే ఒక మొబైల్ ల్యాబ్ వెళ్ళినట్లయితే, చాలా మంది మహిళలు ముందుకు వచ్చి పరిక్షలు చేయించుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా 35 దాటిన ప్రతి మహిళా పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని కాన్సర్ లను ముందుగా గుర్తిస్తే , చికిత్స సులభం అవుతుంది. ఈ మొబైల్ ల్యాబ్ ద్వారా సోనో మామోగ్రామ్, డిజిటల్ మామోగ్రామ్, పాప్సిమీర్ తదితర పరీక్షలు నిర్వహించవచ్చు. కేవలం పరిక్షలు నిర్వహించడమే కాకుండా, కాన్సర్ పట్ల మహిళలకు అవగాహన కల్పిస్తారు. టెస్ట్ చేసిన తర్వాత కాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయితే తదుపరి చికిత్సలైన కీమో థెరపీ. రేడియేషన్ థెరపి అందించే ఏర్పాటు చేస్తారు. ఈ ఆధునిక వాహనం కోసం అవసరమైన 2 కోట్ల రూపాయలలో మచిలీపట్నం లో ఉన్న భారత్ ఎలెక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీ వారు వారి యొక్క సి ఎస్ ఆర్ నిధులు 1.50 కోట్లు , పార్లమెంట్ సభ్యుల ఎం పి ఎల్ ఏ డి ఎస్ నిధుల నుండి 50 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతుంది.

# కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కె. ఆర్.ఎం.బి.) కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలి -ఆంధ్రా రైతుల నీటి హక్కులను కాపాడాలి

## - కె. ఆర్.ఎం.బి. ఛైర్మన్ ఎం.పి.సింగ్ కు విజ్ఞప్తి చేసిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు



**(వి న్యూస్ విజయవాడ):** కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలని ఈనెల 3వ వారంలో హైదరాబాద్ లో జరగనున్న 17 వ బోర్డు సమావేశంలో ప్రధాన ఎజెండాగా చేర్చిన నేపథ్యంలో దీనిపై స్పందిస్తూ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు నేతృత్వంలో సాగునీటి సంఘాల రాష్ట్ర సారధులు కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి ఇతర కార్యవర్గ సభ్యులు ఈరోజు కె. ఆర్.ఎం.బి.చైర్మన్ ఎం.పి.సింగ్ కు పూర్తి వివరాలతో ఈ-మెయిల్ ద్వారా వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఇదే విషయమై ఈరోజు ఉదయం విజయవాడ ప్రెస్ క్లబ్ లో పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో అన్ని రకాల మానిటరింగ్ చేయటానికి కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏర్పడిందని ఈ విషయం మీద దీని ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయటానికి 2018 జనవరిలో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో భవనాలను కూడా పరిశీలించటం జరిగిందని అట్లాగే వై.సి.పి. ప్రభుత్వం ఏర్పడినాక జూన్ 2020 లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయవాడలోనే కె. ఆర్.ఎం.బి. కార్యాలయం ఏర్పాటు చేయటానికి కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాస్తూ దాని ప్రతులను కె. ఆర్.ఎం.బి. సభ్యకార్యదర్శి హైద్రాబాదుకు పంపడం జరిగిందని, అలాగే 2019 నవంబరులోను, 2020 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయవాడలోనే కె. ఆర్.ఎం.బి. కార్యాలయం ఏర్పాటు చేయాలనీ కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయటం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వీటికి విరుద్ధంగా 2020 డిసెంబరులో కె. ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని కె. ఆర్.ఎం.బి.కి విజ్ఞప్తి చేసి ప్రస్తుతం జరుగబోవు 17 వ బోర్డు మీటింగులో ఈ అంశాన్ని చేర్చటం చాలా ధారుణమన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజి క్రింద ఉమ్మడి కర్నూలు, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలో 30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని విజయవాడ పట్టణం కృష్ణానది ఒడ్డున రైల్, రోడ్డు, విమాన సౌకర్యం కలిగి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కె. ఆర్.ఎం.బి. దృష్టికి తీసుకురావటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఇన్ని సానుకూల అంశాలు ఉన్న విజయవాడలో కాకుండా కృష్ణా డెల్టా కు 400 కి.మీ, శ్రీశైలం కు 800 కి.మీ, నాగార్జున సాగర్ కు 700 కి.మీ, దూరంధాటి గోదావరి బేసిన్ అవతల ఉన్న విశాఖపట్నంలో మూడు రాజధానుల్లో భాగంగా కార్యనిర్వాహక రాజధాని నెపంతో కె. ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గతంలో కేంద్ర జలశక్తి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య జరిగిన నిర్ణయాలను పరిగణలోనికి తీసుకుని విజయవాడలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేయటానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కె. ఆర్.ఎం.బి. చైర్మన్ ఎం.పి.సింగ్ కు విజ్ఞప్తి చేసారు. దీని ప్రతులను కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్, న్యూఢిల్లీకి పంపి ఈ విషయంలో జోక్యం చేసుకుని ఆంధ్ర రైతుల నీటి హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నిజంగా రాష్ట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్ర ప్రజల నీటి హక్కుల మీద ధ్యాస ఉంటే శ్రీశైలం ఎగువ భాగాన సిడబ్ల్యుసి కేంద్ర జల శక్తి శాఖ కె.ఆర్.ఎం.బి నుంచి ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా 150 టీఎంసీలతో పాలమూరు రంగారెడ్డి, దిండి, మిషన్ భగీరథ,భక్త రామదాసు, తుమ్మెళ్ళ తదితర కొత్త ప్రాజెక్టులు, 105 టీఎంసీలతో కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్.ఎల్.బి.సి తదితర ప్రాజెక్టులు విస్తరిస్తూ ఉంటే కేవలం లేఖలతో సరిపెట్టకుండా ఈ అక్రమ ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుని ఆంధ్రా రైతుల నీటి హక్కులను కాఆడలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ లు, సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య కార్యవర్గ సభ్యులు ఉప్పలపాటి చక్రపాణి(ప్రకాశం), అంకాళ్ళ ప్రభుదాసు (గుంటూరు), గుండపనేని శ్రీనివాసరావు, బొర్రా అశోక్ కుమార్ (కృష్ణా) తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యములో సంక్రాంతి సంబరాలు



**(వి న్యూస్ పిడుగురాళ్ల):** పిడుగురాళ్ల పట్టణంలోని మంగళవారం ఉదయం 9:00 నుండి 12:00 వరకు పిడుగురాళ్ల, దాచేపల్లి స్కాలర్స్ విద్యాసంస్థలు, మాచవరం స్కాలర్స్ కామినేని స్కూల్సు ఆవరణలో నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమములో రంగవల్లులతో భోగిమంటలు వెలుగులు, భోగిపళ్లు ఆనందాలు, డూ.. డూ.. బసవన్న నాట్యాలు, హరిదాసు కీర్తనలతో ఘనముగా నిర్వహిస్తున్నాము. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు, పిల్లచేత ప్రదర్శించబడును. ఈ కార్యక్రమములో ముఖ్యఅతిధులుగా పిడుగురాళ్ల మున్సిపల్ కమీషనర్ ఏ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొంటారని స్కాలర్స్ విద్యాసంస్థల యాజమాన్యం జి పి రెడ్డి గ్రూప్స్ ఏసి క్యాంపస్ కుమ్మరిపాలెం పిడుగురాళ్ల వారు ఒక ప్రకటనలో తెలిపారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279